సాక్షి

రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న 20 కోడెలను మహబూబాబాద్ జిల్లా శివపార్వతీ గోశాలకు శనివారం అందజేశారు. శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ ఉన్నారు.



రాజన్న నామస్మరణ

వేములవాడ: రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. వేసవి సెలవులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులతో భక్తులు తరలివస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'లక్ష్మణ్'కు ఎక్సలెన్స్ సోషల్ అవార్డు



సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన మానేరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్ సోషల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని అన్వయ కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన టీఎఫ్ఎండీ 9వ గ్లోబల్ సమ్మిట్‌లో అవార్డు అందుకున్నారు. లక్ష్మణ్ ఇటీవల వెలువరించిన కొత్త కవితా సంపుటి 'కామ్‌గార్'కు ఈ పురస్కారం దక్కింది. ఐఏఎస్ అధికారి జయేష్‌రంజన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సిరిసిల్ల సాహితీవేత్తలు జూకంటి జగన్నాథం, పత్తిపాక మోహన్, ఎలగొండ రవి, ఆడెపు ప్రభాకర్, ఐటీ సంస్థ చైర్మన్ ఆడెపు వినోద్ అభినందనలు తెలిపారు.

మే 1న వస్త్రపరిశ్రమ బంద్



తంగళ్లపల్లి(సిరిసిల్ల): సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో శనివారం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో మే డే రోజున టెక్స్‌టైల్ పార్కు వస్త్ర పరిశ్రమ బంద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెక్స్‌టైల్ పార్కు గేటు వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరణ, సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, శ్రీనివాస్, సదానందం, శుభోశఖర్, రాజశేఖర్, రంగయ్య, రవి, నరహరి, మల్లేశం, నాగయ్య, మల్లేశం, హరిదాసు, రామనారాయణ, అంబదాసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా సంరక్షణకే షీ టీమ్స్




సిరిసిల్లటౌన్: మహిళల సంరక్షణకే షీటీమ్స్ పనిచేస్తున్నాయని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కంచర్ల రవిగౌడ్ పేర్కొన్నారు. సిరిసిల్ల లోని బీసీ స్టడీ సర్కిల్‌లో షీటీమ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీటీమ్ ఎస్సై ప్రేమ్‌దీప్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

సీతారామ కల్యాణానికి రండి



కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నాగారం కోదండరామస్వామి ఆలయంలో మే 3న నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. నాగారం ఆలయంలో ఈనెల 30 నుంచి మే 3 వరకు ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ బాస లావణ్య శ్రీనివాస్, ఆలయకమిటీ సభ్యులు కిషన్‌రావు, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



సిరిసిల్ల: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సిరిసిల్లలో నాలుగు కేంద్రాలు, వేములవాడలో ఒక్క కేంద్రంలో ప్రవేశపరీక్షలు జరిగాయి. 2023–24 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. 1,080 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 975 మంది హాజరయ్యారని జిల్లా విద్యాధికారి ఎ.రమేశ్ తెలిపారు.

'జగిత్యాల' మామిడి

వేసవి సీజన్ పండు మామిడి. తినేందుకు, పచ్చడికి మామిడిని వాడుతుంటారు. బంగినపల్లి, హిమాయత్, దశేరీ, సువర్ణరేఖ, నీలం, ముల్‌గోవా, రసాలు ఇలా ఒక్కో మామిడి కాయకు ఒక్కో ప్రత్యేక పేరు ఉంటుంది. కానీ ఫలరాజు మామిడి అంటే టక్కున గుర్తుకొచ్చే ప్రాంతం జగిత్యాల. మామిడి ఎగుమతికి జగిత్యాల కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇక్కడి కాయలకు పలు రాష్ట్రాలు, దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. నాణ్యత, రుచి ఉండడంతో కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వ్యాపారం ఇక్కడ జరుగుతోంది.

– వివరాలు 6లో...



ఇంటికో బండి !

- జిల్లాలో 1,30,378 వాహనాలు
- 1,77,463 ఇళ్లు
- 2014లో జిల్లాలో 33,806 వాహనాలు
- నెలకు కొత్తగా 600 వాహనాల రిజిస్ట్రేషన్లు
- తొమ్మిదేళ్లలో నాలుగురేట్లు
- మోటార్ సైకిళ్లదే అగ్రస్థానం
- జిల్లాలో పెరిగిన కొనుగోలు శక్తి



వెంకటాపూర్‌లో హార్వెస్టర్లు

జిల్లాలో వాహనాల సంఖ్య ఇలా..

మోటార్ సైకిళ్లు	: 90,075
కారు	: 10,594
వ్యవసాయ ట్రాక్టర్లు	: 4,794
కమర్షియల్ ట్రాక్టర్లు	: 3,989
ట్రాక్టర్ ట్రెయిలర్స్	: 6,098
మోపెడ్స్	: 4,356
ఆటోలు	: 3,339
గూడ్స్ క్యారియర్స్	: 3,159
త్రీవీలర్ గూడ్స్	: 1,302
అంబులెన్స్‌లు	: 33
ప్రైవేటు ఓమినీ వాహనాలు	: 207
స్కూల్ బస్సులు	: 157
హార్వెస్టర్స్	: 785
భవన నిర్మాణ యంత్రాలు	: 243



స్కూటీపై ఉన్న ఇతని పేరు దేశవేణి విక్రమ్(30). రుద్రంగికి చెందిన విక్రమ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం ఇంటి నుంచే పనిచేస్తున్నారు. విక్రమ్ పేరుపై ఓ కారు, ఓ స్కూటీ ఉంది. వాళ్ల నాన్న దేశవేణి గంగాధర్ పేరిట మరో బైక్ ఉంది. రుద్రంగిలోని విక్రమ్ ఇంట్లో మూడు వాహనాలు ఉన్నాయి.



ట్రాక్టర్ పక్కన ఉన్న ఇతను రాజబోయిన అంజనేయులు. గంభీరావుపేట మండలం నర్మాల. వ్యవసాయం కోసం ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. కుటుంబ అవసరాల కోసం కారు కొన్నాడు. పొలం దగ్గరికి వెళ్లేందుకు, ఇతర అవసరాలకు బైక్ ఉంది. ఒక్క అంజనేయులు ఇంట్లోనే మూడు వాహనాలు ఉన్నాయి.

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఒక్కో ఇంట్లో ఒకటికి మించి వాహనాలు కనిపిస్తున్నాయి. అవసరాలకు అనుగుణంగా వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. పొలం పనులకు ట్రాక్టర్, కుటుంబ సభ్యులతో కలసి బయటకు వెళ్లేందుకు కారు.. ఇతరత్ర పనుల కోసం బైక్.. ఇలా అవసరాలను బట్టి వాహనాలను జిల్లా ప్రజలు కొంటున్నారు. గత తొమ్మిదేళ్లతో పోలిస్తే ప్రస్తుతం జిల్లాలో వాహనాలు నాలుగు రెట్లు అయ్యాయి. ఇవి రిజిస్ట్రేషన్ వాహనాల లెక్క చూస్తే.. ఇంకా రిజిస్ట్రేషన్ అవసరం ఎలక్ట్రిక్ వాహనాలు సైతం జిల్లా రోడ్లపై చాలానే తిరుగుతున్నాయి.

2014 కంటే నాలుగు రెట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించగా.. అప్పట్లో కుటుంబాల సంఖ్య 1,74,024 ఉన్నాయి. అప్పటి సర్వే ప్రకారం జిల్లాలో వాహనాలు 33,806 మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు జిల్లాలో ఇళ్ల సంఖ్య 1,77,463కు చేరగా వాహనాల సంఖ్య 1,30,378 ఉన్నాయి. తొమ్మిదేళ్లలో నాలుగు రెట్లు వాహనాల సంఖ్య పెరిగింది. వీటితోపాటుట రిజిస్ట్రేషన్ అక్కరలేని ఎలక్ట్రిక్ వాహనాలు మరో 25వేల వరకు ఉంటాయి. ఈ లెక్కన జిల్లాలో ఇంటికో బండి ఉన్నట్లే. ప్రతి నెలా సగటున 600 వాహనాలు కొత్తగా రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. వాహనాల కొనుగోలుకు ప్రైవేటు ఫైనాన్స్‌లు, బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తుండడం కూడా కలిసొస్తుంది. కరోనా లాక్‌డౌన్ తరువాత సెకండ్‌హ్యాండ్ కార్లు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గత ఐదారేళ్లుగా జిల్లాలో వర్షాలు సమృద్ధిగా పడడం, పంటలు మంచిగా పండడం, రియల్‌ఎస్టేట్ పుంజుకోవడం, గల్ఫ్ వలసలతో విదేశీ మారక ద్రవ్యం జిల్లాకు చేరడం వంటి కారణాలతో ఆర్థికంగా స్థిరపడిన వారు వాహనాలు కొనుగోలు చేస్తున్నారు.

రెండు దశాబ్దాల కిందట

జిల్లాలో ఇరవై ఏళ్ల కిందట ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉండేవి. నక్సలైట్ల ప్రాబల్యం ఎక్కువగా ఉండడంతో ఆర్థికంగా ఉన్నప్పటికీ బండి కొనేవారు కాదు. కార్లను అసలే కొనకపోయేది. కల్లోల పల్లెల్లో వాహనాల సంఖ్యను వేళ్లపై లెక్కించే పరిస్థితి ఉండేది. కొత్తగా పెళ్లయిన వారికి అత్తగారు పెళ్లి కొడుక్కి బండి బహుమతిగా ఇస్తామని ముచ్చట పడినా.. వద్దని వారించే పరిస్థితి ఉండేది. నక్సలైట్లకు బండి ఇచ్చారని పోలీసులు వేధించే వారు. ఊరికే బండి మీద రయ్యి.. రయ్యిమని తిరుగుతూ.. మా కదలికలకు విఘాతం కలిగిస్తున్నారని నక్సలైట్లు కన్నెర్రజేసే పరిస్థితులు ఉండేవి. నక్సలైట్ల కదలికలు తగ్గిన నేపథ్యంలో స్వేచ్ఛ మార్కెట్ రావడం, భూములకు ధరలు పెరగడం వంటి కారణాలతో జిల్లాలో వాహనాల సంఖ్య భారీగా పెరిగింది.




ఓ గల్లీలో పార్క్ చేసిన బైక్‌లు, కారు

ద్విచక్ర వాహనాలదే అగ్రస్థానం

జిల్లాలో ద్విచక్రవాహనాల సంఖ్య అగ్రస్థానంలో ఉండగా.. ఈ–కార్లు మాత్రం ఐదే ఉన్నాయి. ప్రైవేటు సర్వీసు వాహనం ఒక్కటి మాత్రమే ఉంది.

35 ఏళ్ల కిందటే కొన్నాను



నేను 35 ఏళ్ల కిందటే మోపెడ్ రూ.7వేలకు కొన్నాను. అప్పట్లో ఎక్కువ మందికి మా ఊరిలో బండ్లు లేవు. నా వ్యాపారం కోసం కొన్నాను. తరువాత చాలా బైక్స్ కొన్నాను. ఇప్పుడు వాహనాల రేట్లు బాగా పెరిగిపోయాయి. అయినా ఇప్పుడు ఇంటికో బండి ఉంది.

– ఇసాక్, మాంసం వ్యాపారి, బావుసాయిపేట


మూడేళ్ల కిందట కొన్న



నా వయసు అరవై ఏళ్లు. చిన్నప్పటి నుంచి సైకిల్‌పైనే తిరిగిన. మూడేళ్ల కిందట ఎలక్ట్రికల్ బైక్ కొన్న. దీనికి డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ అవసరం లేదు. కరెంట్‌తో ఛార్జింగ్ చేసుకుని సులభంగా నడుపుతున్నా. బైక్ పైనే బయటకు వెళ్లి అన్ని పనులు చేసుకుంటున్న.

– కూర భిక్షపతి, ముస్తాబాద్.

నెలకు 600 వాహనాలు



ఇప్పుడు నెలకు 500 నుంచి 600 వరకు వాహనాలు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. అందులోనూ బైక్‌లే ఎక్కువగా కొంటున్నారు. ప్రతి ఇంటికి బండి తప్పనిసరి అవుతుంది. ఎలక్ట్రికల్ బైక్స్ కొంటున్నారు కానీ వాటికి రిజిస్ట్రేషన్ అవసరం లేదు కాబట్టి లెక్క తెలియదు.

– కిశోర్‌కుమార్, ఎంవీఐ, సిరిసిల్ల

'సాక్షి' ఆధ్వర్యంలో ఉచిత డ్యాన్స్ శిబిరం

- మే 1 నుంచి 3 వరకు నిర్వహణ
- ఇంగ్లిష్ యూనియన్ స్కూలు వేదిక

సిరిసిల్లటౌన్: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో చిన్నారులు, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఉచిత డ్యాన్స్ శిక్షణ శిబిరం నిర్వహిస్తుంది. మే 1వ తేదీ నుంచి 3వ తేదీల్లో పిల్లలకు ప్రముఖ డ్యాన్స్‌మాస్టర్ పొందుర్తి ధర్మేందర్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగనుంది. పాత పెట్రోల్‌బంక్ ఎదురు కాలనీలోని ఇంగ్లిష్ యూనియన్ పాఠశాలలో సోమ, మంగళ, బుధవారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత డ్యాన్స్ శిక్షణ తరగతులు కొనసాగుతాయి. తొలి రోజు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, స్థానిక కౌన్సిలర్ జాగీరు శైలు ప్రారంభిస్తారు. ఆసక్తి గల చిన్నారులు డ్యాన్స్‌మాస్టర్ పొందుర్తి ధర్మేందర్ 95733 99404, ఇంగ్లిష్ యూనియన్ పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్ 98665 48054 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సైబర్ నేరాలపై అప్రమత్తం'

సిరిసిల్లఅర్బన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ప్రకటనలో కోరారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతో సైబర్‌నేరాల శాతం పెరుగుతుందని, అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నకిలీ లాటరీ, ఉద్యోగ ప్రకటనలు, గిఫ్ట్‌బాక్స్‌లు, నకిలీలోన్ యాప్‌ల పేర్లతో సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే.. పోగొట్టుకున్న డబ్బులను పొందవచ్చని తెలిపారు.

రాజన్న సేవలో సినీ హీరో



వేములవాడ: రాజన్నను హుషారు సినీ హీరో దినేశ్ తేజ్, డైరెక్టర్ మేకనూరి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. ప్రసాదాలు అందించి ఆశీర్వచనం గావించారు. కౌన్సిలర్ గోలి మహేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్, అర్చకులు, కళాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయొద్దు



సిరిసిల్ల: ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా తప్పుడు ఆరోపణలు చేయొద్దని మైనింగ్‌శాఖ సహాయ సంచాలకులు సైదులు శనివారం కోరారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో క్వారీ లీజు, స్టోన్‌క్రషర్‌లకు అక్రమ అనుమతులు మంజూరు చేశారని కొందరు చేసిన ఆరోపణలపై ఆయన స్పందించారు. జిల్లెల్ల సర్వే నంబరు 676లో తహసీల్దార్ ఎన్వోసీ ఆధారంగానే క్వారీ లీజుకు అనుమతులు ఇచ్చామని, మరో సర్వే నంబరు 683లో పట్టాభూమిలో స్టోన్‌క్రషర్‌కు గ్రామపంచాయతీ అనుమతితో నిర్వహిస్తున్నారని వివరించారు. రెండు రోజుల క్రితం అక్రమ అనుమతులు అని కొందరు ఆరోపించడంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసినట్లు తెలిపారు. జిల్లెల్లలో రెండింటికి అనుమతులు ఉన్నాయని చెప్పారు. ఏమైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, తప్పుడు ఆరోపణలతో ఉద్యోగుల నైతికస్థైర్యాన్ని దెబ్బతీయడం సరికాదన్నారు. ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని కోరారు.

గంజాయి వద్దు.. చదువే ముద్దు

- ఎస్పీ అఖిల్‌మహాజన్

వీర్నపల్లి(సిరిసిల్ల): యువత గంజాయికి దూరంగా ఉంటూ.. చదువుకుంటేనే బంగారు భవిష్యత్ అని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. వీర్నపల్లి రైతు వేదికలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను వినియోగించుకొని భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. గంజాయి నిర్మూలనకు సహకరించాలని, గంజాయి సేవించిన, విక్రయించిన వారి వివరాలు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత చెడుమార్గం వైపు వెళ్లకుండా ఉద్యోగాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సీఐ మొగిలి, ఎస్సై నవత తదితరులు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని అందిస్తున్న ఎస్పీ

ఉత్సాహంగా బీరప్ప గంగబోనం



బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని విలాసాగర్‌లో శ్రీకృష్ణకుర్మ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరప్ప కామరాతిదేవీ కల్యాణోత్సవంలో భాగంగా శనివారం గంగబోనం ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో బీర్ల కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

8 నుంచి నిరవధిక నిరాహార దీక్ష

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మే 8 నుంచి 10వ తేదీ వరకు నిరవధిక నిరాహారదీక్ష చేపడుతున్నట్లు ముంపు గ్రామాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. వేములవాడ మండలం రుద్రవరంలో శనివారం సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రతి కుటుంబానికి రూ.5.04 లక్షలు అందించాలని, ప్రతీ కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం అఖిలపక్షం, ఐక్యవేదిక నాయకులు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ను, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను కలిసి మద్దతు కోరారు. ఐక్యవేదిక అధ్యక్షుడు కూస రవీందర్, ఎర్రం మహేశ్, పిల్లి కనకయ్య, ఎర్రం రాజు, చింతపల్లి వెంకటేశ్వరరావు, బుర్ర శేఖర్, గాలిపెల్లి స్వామి, ఎర్రం ఆగయ్య, పర్శరాములు, మోహన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, జింక అనిల్ ఉన్నారు.

2న కార్మిక ఆత్మీయ సమ్మేళనం

సిరిసిల్ల: సిరిసిల్లలో మే 2న కార్మిక ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం కార్మికశాఖ అధికారులతో సమీక్షించారు. మే 2న పద్మనాయక కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో అన్నిరంగాల కార్మికులు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్మికశాఖ ఉపకమిషనర్ రమేశ్‌బాబు, సహాయ కమిషనర్ కోటేశ్వర్లు, సహాయ కార్మిక అధికారి రఫీ, చేనేత, జౌళిశాఖ అధికారి ఎం.సాగర్, జిల్లా రవాణాశాఖ అధికారి వై.కొండల్‌రావు, ఎక్సైజ్ జిల్లా అధికారి పంచాక్షరి, డీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్ ఉన్నారు.

విలీన గ్రామాలపై సవతి ప్రేమ చూపొద్దు

- బీజేపీ కౌన్సిలర్ల ధ్వజం
- వాడీ వేడిగా మున్సిపల్ సమావేశం
- పది అంశాల్లో తొమ్మిదికి ఆమోదం

సిరిసిల్లటౌన్: గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్‌లో విలీనమైన ఏడు గ్రామాలపై సవతి ప్రేమ చూపొద్దని బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరిగింది. పలు సమస్యలపై బీజేపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. విలీన గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉంటుందన్నారు. ఐదేళ్ల పాటు గ్రామ పంచాయితీ ప్రకారమే ట్యాక్సులు విధించాలని కోరారు. మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కౌన్సిలర్లు నాగరాజుగౌడ్, గూడూరి భాస్కర్ అన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

సిరిసిల్లలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు కౌన్సిల్ సమావేశం అనంతరం కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ కలిసి మీడియాతో మాట్లాడారు. రూ.1.95 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. పట్టణంలోని ప్రధాన జంక్షన్స్ అభివృద్ధికి రూ.1.80కోట్లు, వేసవిలో పవర్‌బోర్లు రిపేర్లు, కొత్తమోటార్ల బిగింపు, నిర్వహణకు రూ.10 లక్షలు, శానిటేషన్ సిబ్బందికి రక్షిత పరికరాలు, వస్తువులకు రూ.5లక్షలు విధించినట్లు పేర్కొన్నారు. టీపీవో అన్సార్, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ కళ

ఫిల్టర్‌బెడ్ నిర్వహణపై స్పష్టత లేదు
– అధికార పార్టీ కౌన్సిలర్ల వ్యతిరేకత

ఎజెండాలో పొందుపరిచిన నాలుగో అంశం ఫిల్టర్ బెడ్ నిర్వహణపై స్పష్టత లేదని అధికార పార్టీకి చెందిన రెడ్యానాయక్ అభ్యంతరం వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. ఎజెండాలో పది అంశాలపై చర్చ జరుగగా..తొమ్మిది అంశాలపై సమ్మతం తెలిపారు. నాలుగో అంశంలో సిరిసిల్ల పట్టణానికి తాగునీటి సరఫరా నిమిత్తం ఏడాదికి రూ.42లక్షలకు కౌన్సిల్ ఆమోదానికి ఉంచగా స్పష్టత లేదని బీఆర్ఎస్ కౌన్సిలర్ రెడ్డినాయక్ పేర్కొన్నారు. ఆయన సూచనకు మెజార్టీ సభ్యులు సమ్మతం తెలిపారు. ఇదే అంశంపై గతంలో ఫిల్టర్‌బెడ్ స్థలాన్ని మిషన్ భగీరథ శాఖకు రిజిస్ట్రేషన్ చేయడానికి సమ్మతించగా.. తిరిగి రిజిస్ట్రేషన్ చేయకుండా నిర్వహణ నిమిత్తం నిధులు కేటాయించడంపై అధికార పార్టీలోనే వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై మెజార్టీ సభ్యుల అంగీకారంతో కమిషనర్ సమ్మయ్య నాలుగో అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయమై సమావేశం అనంతరం చైర్‌పర్సన్ చాంబర్‌లో అధికార కౌన్సిలర్లు, అధికారులతో వాగ్వాదానికి దిగడం చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

డ్యాన్స్‌మాస్టర్ అశోక్‌కు జాతీయ అవార్డు



అవార్డు పొందుతున్న నక్క అశోక్

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన డాన్స్‌మాస్టర్ నక్క అశోక్‌కు జాతీయ అవార్డు దక్కింది. తమిళనాడులో 'ఇచ్చా ఫౌండేషన్ అసోసియేటెడ్ విత్ ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్' ఆధ్వర్యంలో అవార్డు అందజేశారు. సిరిసిల్లకు చెందిన శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ గౌరవ అధ్యక్షుడు గుగ్గిళ్ల జగన్‌గౌడ్, ఎండీ సలీం, దుమాల శ్రీకాంత్, కొత్వాల సాయి అభినందనలు తెలిపారు.

వికాస్ సెలబ్రేషన్స్ అదుర్స్



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఉత్సాహంగా జరిగింది. స్థానిక పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాతవాహన యూనివర్సిటీ వీసీ సంకశాల మల్లేశ్, ఓఎస్డీ రమేశ్ హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల యాజమాన్యం దిడ్డి శ్రీనివాస్, గుగ్గిళ్ల జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

జెండా గద్దె నిర్మాణానికి అనుమతివ్వండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

వేములవాడ: మే డే ఉత్సవాల నిర్వహణకు జెండా గద్దె నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో కార్మికులు శనివారం మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌కు వినతిపత్రం అందించారు. గతంలోనూ తాము గద్దె నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నామని, ఈసారి స్థలం చూపించాలని కోరారు.

'జగిత్యాల' మామిడి

సండే స్పెషల్

- మామిడి ఎగుమతికి కేరాఫ్ జగిత్యాల
- ఇక్కడి కాయలకు పలు రాష్ట్రాలు, దేశాల్లో మంచి డిమాండ్
- నాణ్యత, రుచితో కొనుగోలుకు వ్యాపారుల పోటీ
- ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200కోట్ల వ్యాపారం

జగిత్యాలఅగ్రికల్చర్: బంగినన్‌పల్లి, హిమాయత్, దశేరీ, సువర్ణరేఖ, నీలం, ముల్‌గోవా, రసాలు ఇలా ఒక్కో మామిడికాయకు ఒక్కో ప్రత్యేక పేరు ఉంటుంది. కానీ ఫలరాజు మామిడి అంటే టక్కున గుర్తుకొచ్చే ప్రాంతం జగిత్యాల. దేశవిదేశాల్లో ఎక్కడున్నా.. సీజన్‌లో జగిత్యాల నుంచి వచ్చిన మామిడిపండును రుచిచూడక మానరు. జగిత్యాల మామిడికి రుచి, పరిమాణంలో ప్రత్యేకత ఉంటుంది. అందుకే దేశంలోని అన్ని రాష్ట్రాలకు, విదేశాలకు సీజన్‌లో టన్నుల కొద్ది మామిడికాయ ఎగుమతి అవుతుంది. ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వ్యాపారం ఇక్కడ జరుగుతుంది.



లారీల్లో తరలిస్తున్న మామిడికాయలు

వైఎస్సార్ ఏర్పాటు చేసిన మార్కెట్

మొన్నటి వరకు కల్లోల ప్రాంతంగా ముద్రపడిన జగిత్యాల నేడు మామిడి రుచులతో దేశ,విదేశాల్లో గుర్తింపు తెచ్చుకుంటోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అప్పటి మంత్రి జీవన్‌రెడ్డి ప్రోద్బలంతో జగిత్యాలలో రాజీవ్‌గాంధీ మామిడి మార్కెట్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం మామిడి మార్కెట్లలో వసతులు కల్పిస్తుండడంతో మరింత డిమాండ్ ఏర్పడింది. జగిత్యాల మామిడి మార్కెట్‌తో పాటు మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల నుంచి ఏటా రూ.200కోట్ల వరకు వ్యాపారం సాగుతోంది.



మామిడికాయలను ప్లాస్టిక్ ట్రేలో నింపుతున్న కూలీలు

ఈసారి తగ్గిన దిగుబడి..

రెండేళ్ల క్రితం కిసాన్ రైలు ద్వారా ఢిల్లీవరకు మామిడి ఎగుమతి అయ్యింది. మార్కెట్లోని 88మంది కమీషన్ ఏజెంట్లు ఇతరరాష్ట్రాల వ్యాపారులకు మామిడిని పంపిస్తుంటారు. ఈ ఏడాది మామిడికాయకు మంగు ఏర్పడటం, కాయలు తక్కువగా ఉండటంతో వ్యాపారం కాస్త తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల్లో మామిడి తోటల విస్తీర్ణం ఉండగా, కనీసం 1.50లక్షల మెట్రిక్ టన్నుల మామిడికాయ రావాల్సిఉండగా.. పంటనష్టంతో సగం దిగుబడే వచ్చే అవకాశముంది.

జగిత్యాల మామిడికి గిరాకీ ఎందుకంటే

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నూజివీడు, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, తిరుపతి, జగిత్యాలలో మామిడి మార్కెట్లు ఉన్నాయి. దేశం మొత్తం దిగుబడుల్లో సగంవాటా రెండు తెలుగు రాష్ట్రాలదే. ఇందులో 10–15శాతం వాటా జగిత్యాల మామిడిదే ఉంటుంది. ఈ ప్రాంతంలోని ఎర్రనేలలు మామిడిపంటకు అనుకూలమైనవి. కాయ రంగు, రుచి బాగుంటుంది. నీటివసతి కారణంగా పరిమాణం పెద్దదిగా ఉంటుంది. ఇక్కడి మామిడికాయలు రవాణాలో డ్యామేజీ కావు. ఎన్నిరోజులైనా కాయ నాణ్యతగా ఉంటుంది. ఢిల్లీ వంటి మార్కెట్లలో జగిత్యాల కాయరాగానే వ్యాపారులు కొనుగోలుకు పోటీ పడుతుంటారు. రెండేళ్ల క్రితం కిసాన్ రైలు ద్వారా జగిత్యాల నుంచి దాదాపు 3–4 వేల మెట్రిక్ టన్నుల మామిడికాయ ఢిల్లీకి ఎగుమతైంది.

మంచి రుచితో విదేశాలకు

జగిత్యాల జిల్లాలో 50వేల ఎకరాలు, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, నిర్మల్ ప్రాంతాల్లో మరో 30వేల ఎకరాల్లో మామిడి సాగవుతుంది. బంగిన్‌పల్లి, హిమాయత్, దశేరీ రకాలనే ఇక్కడి రైతులు సాగు చేస్తుంటారు. కాయలను నైపుణ్యం గల ఇతర రాష్ట్రాల కార్మికులు గ్రేడింగ్ చేసి, ఢిల్లీకి పంపిస్తున్నారు. అక్కడి ఎగుమతి వ్యాపారులు గల్ఫ్‌దేశాలైన దుబాయ్, ఖతర్, మస్కట్, సౌదీ, బహ్రెయిన్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్, నేపాల్‌కు ఎగుమతి చేస్తున్నారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, జమ్ముకాశ్మీర్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, వారాణాసీ, అలహాబాద్, ఛండీఘర్, నాగ్‌పూర్, నాసిక్, ముంబై, చంద్రపూర్, నాందేడ్ తదితర ప్రాంతాలకు ఇక్కడి సరుకు ఎగుమతి అవుతుంది. దశేరి రకం హైదరాబాద్, బెంగళూర్, ముంబయి వంటి మెట్రోసిటీలకు ఎగుమతవుతోంది.

రైతుకు లాభం అంతంతే..

ఈ పంటసాగులో రైతులకు లాభం అంతంతే. ఓపెన్ మార్కెట్ లేకపోవడం, కమీషన్ ప్రతిపాదికన వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన రేటు పెట్టి కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారులదే పైచేయి అవుతోంది. రాటన్, సూట్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు నేరుగా నాగ్‌పూర్ మార్కెట్‌కు కాయలు తీసుకెళ్తున్నారు.

ధరలేదు



ఏటా మామిడికాయలను మార్కెట్‌కు తీసుకువస్తున్నప్పటికీ సరైన ధరరావడం లేదు. జిల్లా అయినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకున్నట్లు కనబడటం లేదు. ఈ ఏడాది ఓ వైపు రేటు రాకపోవడమే కాకుండా, మరోవైపు కాయకు మంగు వచ్చి నల్లగా మారాయి. అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి.

– రవీందర్‌రెడ్డి, రైతు, రాయికల్

జగిత్యాల కాయకు డిమాండ్



జగిత్యాలకాయకు అన్ని రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ వ్యాపారులు కొనుగోలు చేసిన కాయ ఢిల్లీకి వెళ్లి, అక్కడి నుంచి విదేశాలకు వెళ్తుంది. జగిత్యాలకు చెందిన కాయ తాజాగా, పరిమాణంలో పెద్దగా కనబడటంతో చాలామంది కొనుగోలు చేస్తుంటారు.

– ఎండీ మోయిన్, మామిడి వ్యాపారి, జగిత్యాల

జగిత్యాల మామిడి బ్రాండ్



జగిత్యాల మామిడి అంటేనే ఓ బ్రాండ్. నాణ్యతతో పాటు రుచిగా ఉంటుంది. రాబోయే రోజుల్లో జగిత్యాల మామిడి మార్కెట్‌ను తెలంగాణలోనే ఓ మోడల్ మామిడి మార్కెట్‌గా తీర్చిదిద్దనున్నాం. అదనంగా 10 ఎకరాల స్థలం మామిడి మార్కెట్‌కు తీసుకోవడంతో పాటు రూ.7 కోట్లతో షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

– నక్కల రాధ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, జగిత్యాల

మంచి డిమాండ్ ఉంది



జిల్లాలో 50 వేల ఎకరాల వరకు, చుట్టుపక్కల జిల్లాలో మరో 30వేల ఎకరాల వరకు మామిడి సాగవుతోంది. ఇక్కడి కాయకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. రంగు, రుచితో పాటు ఎన్ని రోజులు రవాణా చేసినా చెడిపోదు అనే పేరుంది. మామిడికి ఉన్న డిమాండ్, వడగాల్పుల దృష్ట్యా కాయ ముదరక ముందే తెంపి, ఇతర రాష్ట్రాలకు పంపించడంతో ముక్కిపోతుంది.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

గోదావరి జలాలతో మత్స్యకారులకు ఉపాధి

ముస్తాబాద్(సిరిసిల్ల): పల్లెలకు వస్తున్న గోదావరి జలాలతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తోందని రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు పేర్కొన్నారు. మోహినికుంట చెక్‌డ్యామ్‌లోకి గోదావరి జలాలు వచ్చాక, అక్కడి మత్స్యకారులు పెంచిన చేపలను శనివారం పట్టుకున్నారు. ఈసందర్భంగా గోపాల్‌రావు వారితో కలిసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచన విధానంతోనే గోదావరి జలాలు బీడు భూములకు మళ్లాయన్నారు. అదేవిధంగా చెక్‌డ్యామ్‌లు, చెరువులలోకి నీరు పుష్కలంగా చేరి మత్స్య సంపద పెరిగిందని పేర్కొన్నారు.



చేపలు పడుతున్న మత్స్యకారులతో గోపాల్‌రావు

రైతులు అధైర్యపడొద్దు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అకాల వర్షాలతో పంటనష్టం జరిగిన రైతన్నలు అధైర్యపడొద్దని తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస అన్నారు. అకాల వర్షాలతో పంట నష్టం జరిగిన గ్రామాలను శనివారం ఆమె సందర్శించి, పంటనష్టాన్ని పరిశీలించారు. మానస మాట్లాడుతూ తడిసిన ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. అంచనాల తరువాత ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటిస్తుందని తెలిపారు.



పంటనష్టం పరిశీలిస్తున్న ఎంపీపీ మానస

రెండో రోజు కొనసాగిన పోలీసు క్రీడలు



వాలీబాల్ టీమ్స్‌తో ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో రెండో రోజు పోలీస్ క్రీడలు ఉత్సాహంగా సాగాయి. శనివారం రాత్రి జరిగిన వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ తిలకించారు. వాలీబాల్ విజేతగా డీఏఆర్ రేంజర్స్, రెండోస్థానంలో వేములవాడ రుద్రస్ నిలిచింది.

ఐఐటీ- జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విజయభేరి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎస్.పవన్ సూర్య 220వ ర్యాంక్, బి.భవ్య 748, పల్లె బిందు 1,482, యూ.మోహన్ సాయి 2,347, బి.సాయిచరణ్ 4,652, ఆర్.అనన్యరెడ్డి 10,299, ఎం.ఈశ్వర్ నాయక్ 10,482, కె.మాధురి 10,712 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. ఎస్.పవన్ సూర్య 99.98, యూ.మోహన్ సాయి 99.10, పి.బిందు 99.08, డి.హారిక 98.11, కె.మాధురి 96.60, డి.వంశీకృష్ణ 95.38, ఆర్.అనన్యరెడ్డి 94.44, జి.రామక్రిష్ణరెడ్డి 91.88 శాతంసాధించారు. పరీక్షకు హాజరైన 60శాతం మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడంలో శ్రీచైతన్య మరో సంచలనం సృష్టించింది. విద్యార్థులను చైర్మన్ రమేశ్‌రెడ్డి ,కళాశాలల డీన్ జగన్ మోహన్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధక్రిష్ణ, ఎజియం. శ్రీనివాస్ అభినందించారు.

యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలి



కొనుగోలు కేంద్రంలో నాగి శేఖర్ తదితరులు

బోయినపల్లి(వేములవాడ): కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యాని ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని కాంగ్రెస్ నాయకుడు నాగి శేఖర్ కోరారు. మండలంలోని విలాసాగర్‌లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. శేఖర్ మాట్లాడుతూ వడగండ్లతో ళ్ల దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నాయకులు ఎగుర్ల కొమురయ్య, మనోహర్, రాజేశం, అనిల్, పర్శరామ్, మల్లికార్జున్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నదాతలను ఆదుకోండి



పంటలు పరిశీలిస్తున్న ఉమేశ్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వడగండ్ల వానలతో నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటీ ఉమేశ్‌రావు కోరారు. మండలంలోని కోరుట్లపేట, రాచర్లతిమ్మాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను శనివారం పరిశీలించి మాట్లాడారు. మూడు రోజులుగా కురుస్తున్న వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రంగుమారిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒరుగంటి తిరుపతి, గౌస్, సాహెబ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌రెడ్డి, రాజు, దండు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'జాతీయ విపత్తు నిధులు ఏం చేసిండ్రు'

సిరిసిల్లటౌన్: జాతీయ విపత్తు నిధులను రాష్ట్ర సర్కారు ఏం చేస్తుందో చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి ప్రశ్నించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులపై సీఎం కేసీఆర్ సవతి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఆత్మీయ సమ్మేళనం పేరుతో సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ గొర్లు కోసి దావత్ చేసుకుని రైతుల సమస్యలను తెలుసుకోకుండా హైదరాబాద్‌కు పోయారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో 40 కిలోల నిబంధనల ప్రకారం 400గ్రాములు తరుగు తీయాలని కానీ 2 కిలోల చొప్పున తీయడం ఏంటని ప్రశ్నించారు. అధికారం ముసుగులో అన్నదాతలను అరిగోస పెడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి సరైన గుణపాఠం నేర్పుతామన్నారు. వెంటనే రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని లేకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జగదీశ్వర్



జగదీశ్వర్‌ను అభినందిస్తున్న జిల్లా నాయకులు

సిరిసిల్ల: తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం (టీఎన్జీవో) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారం జగదీశ్వర్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగదీశ్వర్‌ను జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి గాజుల సుదర్శన్ హైదరాబాద్‌లో కలిసి అభినందించారు. టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ప్రతినిధులు శ్రీకాంత్, మహ్మద్ రియాజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీకి గాయాలు

చందుర్తి(వేములవాడ): చందుర్తి శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్యాలకు చెందిన ఆర్‌ఎంపీ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. మల్యాల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ శివ బైక్‌పై చందుర్తి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో గాయపడ్డ ఆర్‌ఎంపీ శివను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి పరారీలో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. చందుర్తి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపై నుంచి బైక్‌లను తొలగించారు.

ఇటుక ట్రాక్టర్ బోల్తా



వంతెన కింద పడ్డ ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని కోరుట్లపేట దారిలోని వంతెన వద్ద శనివారం ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదాన్ని ముందె గ్రహించిన డ్రైవర్ నరేశ్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. వంతెనకు సైడ్ వాల్స్ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బహుజన రాజ్యాధికారం కోసం సంఘటితంగా పోరాడాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్ధవెల్లి స్వామిగౌడ్ కోరారు. హైదరాబాద్‌లో మే 7న నిర్వహించే బహిరంగ సభ పోస్టర్లను ఎల్లారెడ్డిపేటలో శనివారం ఆవిష్కరించారు. స్వామిగౌడ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సభకు ప్రజలను సమీకరించాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి సంజీవ్‌ను నియమించారు. నీరటి భాను, నీలేశ్, లక్ష్మీరాజం, ప్రవీణ్, సాయిచంద్, బుచ్చయ్య, కిషన్ పాల్గొన్నారు.

భరోసా సభను విజయవంతం చేయండి

–బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బట్టు రామచంద్రం

కోనరావుపేట(వేములవాడ): అసమానతలు, అణచివేతలు, దొరల గడీల పాలన నుంచి విముక్తి కోరుతూ నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బట్టు రామచంద్రం కోరారు. కోనరావుపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంతో పేదల బతుకులు బాగుపడుతాయనుకుంటే.. దారుణంగా తయారయ్యాయన్నారు. అప్పుడు, ఇప్పుడు అగ్రవర్ణాలే బాగుపడ్డారన్నారు. హైదరాబాద్‌లో మే 7న నిర్వహించే ఈ సభకు మాయావతి హాజరవుతున్నారని.. జిల్లా ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు నందూనాయక్, ఇన్‌చార్జి బొడ్డు మహేందర్ ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్‌లో నిర్వహించే భరోసా సభ పోస్టర్‌ను బీఎస్పీ మండలాధ్యక్షుడు కుమ్మరి దేవదాస్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. దండెం ప్రమోద్, అక్కెనపల్లి వినోద్, తైదల దేవదాస్, సునీల్, జాషువా, అశిల్, అజయ్, వినయ్ పాల్గొన్నారు.

మంకు రాజయ్య సేవలు ఎనలేనివి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టిన దివంగత ఎంఈవో మంకు రాజయ్య కృషి ఎనలేనిదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కొనియాడారు. సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక బీసీ సంఘం, ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో రాజయ్య రెండో వర్ధంతి సభ నిర్వహించారు. హన్మండ్లు మాట్లాడుతూ స్థానికులను చైతన్యం చేసి మూతబడిన ప్రభుత్వ బడులను తెరిపించిన ఘనత రాజయ్యదేనని పేర్కొన్నారు. మంకు రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. లకావత్ శర్మన్‌నాయక్, దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రమానాథ్‌రెడ్డి, పాకాల శంకర్‌గౌడ్, గన్నమనేని శ్రీనివాస్‌రావు, బుర్క గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



రాజయ్యకు నివాళి అర్పిస్తున్న హన్మాండ్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు